


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 04-06-2025 సంపుటి : 07 సంచిక : 21 పేజీలు : 8 వెల : రూ 3-00


# గత ప్రభుత్వంలో గంజాయికి అడ్డాగా తెనాలిని మార్చేశారు



**రెండు గ్యాంగ్ లను సృష్టించి గంజాయి అమ్ముకునే హక్కు కల్పించారు**
**గంజాయి మత్తులో ఆ గ్యాంగ్ లు అనేక అరాచకాలకు పాల్పడ్డారు**
**ప్రజలు భయభ్రాంతులకి లోనయ్యారు**
**దారి కాచి అకారణంగా దాడులు చేసేవారు**
**గంజాయి ముఠాల వల్ల బాధితులకి శ్రీ జగన్ ఏం సమాధానం చెబుతారు?**
**రాజకీయ లబ్ధి... సమాజంలో చీలికల కోసమే జగన్ తెనాలి పర్యటన**
**గతంలో అమలాపురంలో ఇలాంటి అలజడే సృష్టించారు**
**రెండు రోజుల్లో 35.81 లక్షల మందికి రేషన్ పంపిణీ**
**విజయవాడలోని మీడియా సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రినాదెండ్ల మనోహర్**

అమరావతి:'ఎంతో చరిత్ర కలిగిన... కళల కాణాచిగా ఉన్న తెనాలిని గత వైసీపీ ప్రభుత్వం గంజాయికి అడ్డాగా మార్చేసింది. రెండు గ్యాంగ్ లను సృష్టించి ప్రాంతాలవారీగా గంజాయి అమ్ముకునే హక్కు కల్పించింది. గంజాయి మత్తులో ఈ గ్యాంగ్ లు సృష్టిస్తున్న అరాచకాలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నార'ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి పర్యటనతో రాద్ధాంతం సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని, సమాజంలో చీలికలు తేవాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. గంజాయి మత్తులో అరాచకాలు చేసే రౌడీ షీటర్లను పరామర్శించడానికి జగన్ వస్తున్నారా..? అంటూ సూటిగా ప్రశ్నించారు. శాంతి భద్రతలను కంట్రోల్ చేయాల్సింది పోలీసులేనని, తప్పు చేసిన వారికి కులం ఏమిటిని ప్రశ్నించారు. జగన్ వాస్తవాలు తెలుసుకుని తెనాలిలో పరామర్శకు రావాలని హితవు పలికారు. సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "గంజాయి గ్యాంగ్ ల వల్ల తెనాలి ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు తెలుసుకొని జగన్ పరామర్శకు రావాలి. గంజాయి మత్తులో ఆ గ్యాంగులు చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. వాళ్లలో వాళ్లు చంపుకోవడంతోపాటు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారు. ఈదర పూర్ణచంద్ అనే ఆదర్శ రైతు కుమారుడు కార్తీక్ ముంబయిలో సాఫ్ట్వేర్ ఇంజనీర్. గత ఏడాది మే 1వ తేదీన ఆ యువకుడు తెనాలి వచ్చి బైక్ మీద వెళ్తుంటే గంజాయి బ్యాచ్ అడ్డగించి దారుణంగా దాడి చేశారు. గంజాయి గ్యాంగుల అండతో గత ఎమ్మెల్యే రెచ్చిపోయారుగంజాయి గ్యాంగ్ లు తన పక్కన ఉన్నాయని గత వైసీపీ శాసనసభ్యుడు ఎంత అహంకారంతో మాట్లాడారో మనందరికి తెలుసు. తెనాలిలో ఎలక్షన్లను ఐదు నిమిషాల్లో ముగిస్తామని, కళ్లు మూసి తెరిచేలోపు మొత్తం పని ముగిస్తామని వ్యాఖ్యలు చేశారు. అందులో భాగంగానే పోలింగ్ బూత్ లో సుధాకర్ అనే ఓటరుపై విచక్షణ లేకుండా దాడి చేశారు. అలజడి సృష్టించాలని చూశారు. అయితే పోలీసులు, ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో ఆయన ప్లాన్ విఫలమయింది. గంజాయి మత్తులో ఆ గ్యాంగ్ లు ఎంతకైనా తెగిస్తున్నాయి. ఐతానగర్ ఏరియా లో ఇళ్లలోనే గంజాయి పెంచారు. తెనాలి దగ్గర్లో తేలప్రోలు ఉంది. అక్కడ ముస్లిం కుటుంబాలు ఎక్కువ. వారి పిల్లలు స్కూళ్లు, కాలేజీలకి వెళ్ళి రావాలంటే ఐతా నగర్ మీదుగా రాకపోకలు సాగించాలి. తేలప్రోలు ప్రజలు గంజాయి ముఠాలకి భయపడిపోయారు. కొల్లిపర మండలం వల్లభాపురం అనే ఊరు ప్రశాంతంగా ఉండేది. అక్కడా గంజాయి అమ్మి యువతను తప్పుదోవ పట్టించారు. గంజాయి ముఠాలను పట్టుకోవడానికి వస్తే దాడులుగంజాయి మూలాలు వెదుకుతూ స్మగ్లర్లను పట్టుకోవడానికి రాష్ట్రానికి వచ్చిన తెలంగాణ పోలీసులపై దాడి చేశారు. అదీ వైసీపీ అరాచక తీరు. వైసీపీ వాళ్లు శాంతి భద్రతలు అంటే లెక్కలేనట్లు వ్యవహరిస్తూ ఎంతోమందిని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. గంజాయి నిర్మూలనకు ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి నిప్పుపెడితే... అటువంటి అధికారులను ట్రాన్స్ ఫర్ చేసిన చరిత్ర గత పాలకులది. ప్రశాంత వాతావరణంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పని చేస్తుంటే... కావాలని లేనిపోని వివాదం సృష్టించి సమాజంలో చీలిక తీసుకురావాలని జగన్ చూస్తున్నారు.గతంలో అమలాపురంలో ఇలాంటి వివాదమే సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు. ఇప్పుడు తెనాలిలో కూడా అలాంటి పథకమే రచించారు. జగన్ ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకొని తన నిర్ణయాన్ని పున:పరిశీలించుకోవాలి. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా 29,760 రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటి వరకు 34.81 లక్షల మందికి రేషన్ సరకులు అందించాం. 3.73 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరకులు ఇచ్చాం. గత ఏడాది ఇదే సమయానికి అప్పటి ప్రభుత్వం 9260 ఎండీయూ వాహనాలతో 25.18 లక్షల మందికి మాత్రమే సరుకులు పంపిణీ చేసింది. వాళ్లతో పోల్చుకుంటే మనం 60 శాతం ఎక్కువగానే ఇచ్చాం.


# తుని కేసుపై సర్కార్ క్లారిటీ




అమరావతి, జూన్ 3: తుని కేసు కు సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తుని కేసు తిరగదోడే ఉద్దేశం లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. తుని కేసు కొట్టేస్తూ రైల్వే కోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే యోచన లేదని సర్కార్ స్పష్టం చేసింది. తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏ స్థాయిలో ఆమోదంతో ఫైల్ నడిచిందనే విషయంపై సర్కార్ ఆరా తీసింది. కేసుపై ఆర్‌పీజీ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఉత్తర్వు లు వెలువడినట్టు గుర్తించింది. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని ప్రభుత్వం నుంచి అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. జీవోను రద్దు చేస్తూ కాసేపట్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.తుని కేసును కింది కోర్టు కొట్టివేయడంతో హైకోర్టుకు వెళ్లాలంటూ నిన్న (సోమవారం) ఇచ్చిన ఉత్తర్వులపై నేడు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. దీనికి సంబంధించి ఎవరు బాధ్యులు అనేదానిపై పరిశీలన చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. తుని కేసును కొట్టివేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే ఆలోచన ప్రభుత్వానికి లేదు అని అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. సున్నితమైన ఇలాంటి అంశాలపై అలసత్వంతో జరిగే ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదు అని అధికారులకు ప్రభుత్వం గట్టి వార్నింగ్ ఇచ్చింది.


# తెనాలిలో వైఎస్ జగన్ పర్యటనపై నిరసనలు

గుంటూరు: గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారు. జగన్ పర్యటన కోసం స్థానిక కేడర్ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే జగన్‌కు మాత్రం నిరసనల రూపంలో ఊహించని షాక్ తగిలింది. జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత, ప్రజాసంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. తెనాలి మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన నూతక్కి కిరణ్‌ను జగన్ పరామర్శించలేదని... రౌడీషీటర్లకు మద్దతుగా నిలవడం దారుణమంటూ దళిత, ప్రజాసంఘాలు నినాదాలు చేశాయి. తెనాలిలో జగన్‌కు నిరసనల సెగ తగలడంతో వైసీపీ నేతలు డైలామాలో పడ్డారు.అలాగే ఐతానగర్ సెంటర్‌లో జగన్‌ను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. జగన్ గో బ్యాక్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. తెనాలిలో ఎర్ర బడి వద్ద జగన్ కాన్వాయ్‌ను ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు అడ్డుకున్నారు. దళితులపై ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందా అంటూ నిరసన వ్యక్తం చేశారు. హత్యలు చేసిన వారిని, రౌడీషీట్లు ఉన్నవారిని, పోలీసులను కొట్టిన వారిని జగన్మోహన్‌రెడ్డి ఎలా పరామర్శిస్తారని ఎమ్మార్పీఎస్ నేతలు నిలదీశారు. నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. అయితే రోడ్డు మీదకు వస్తున్న దళిత సంఘాలను పోలీసులు అడ్డుకున్నారు. తెనాలిలో భారీగా పోలీసులు మోహరించారు. దీంతో తెనాలిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది.



# 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టండి

**టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



విభారే న్యూస్.నంద్యాల, జూన్, 03 :-ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5వ తేదీన పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీఓలు, డిప్యూటీ సీఈఓ, మున్సిపల్ ఇంజనీర్లు, ఎంపిడిఓలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.×ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఓలు, స్పెషల్ ఆఫీసర్లను కలెక్టర్ ఆదేశించారు. 489 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామ పంచాయతీలో 200 నుండి 250 మొక్కల చొప్పున లక్ష మొక్కలను నాటాలన్నారు. ఐదు మున్సిపాలిటీల పరిధిల్లో 30వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలకు 30 మొక్కల చొప్పున 1300 ప్రభుత్వ పాఠశాలల్లో 39 వేల మొక్కలను నాటేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 21 ప్రభుత్వ కళాశాలల ఆవరణంలో 50 మొక్కల చొప్పున వెయ్యి మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకోవాలని డీవీఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా సాంఘిక సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, బీసీ సంక్షేమం, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాల్లో 5వేల మొక్కలు నాటేలా సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, మైనింగ్ శాఖలలో 15 వేల మొక్కలు నాటేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో 30 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడిని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఇరిగేషన్ తదితర అనుబంధ రంగాల్లో కెనాల్ బండ్స్, పొలాల గట్ల మీద మొక్కలు పెంచేలా చూడాలన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో 40 వేల మొక్కలు నాటేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డిఎఫ్ఓ లను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా హౌసింగ్ కాలనీలలో ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి 20వేల లక్ష్యాన్ని పూర్తి చేయాలని హౌసింగ్ పిడిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో 10 వేల మొక్కలు నాటాలన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, నేషనల్ హైవే పరిధిలో ఉన్న వసతి గృహాల్లో 5 వేల మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాల ఆవరణలలో 75 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# 65 సంవత్సరాలు పైబడిన వారు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు రావాల్సిన అవసరం లేదు

**వారికి ఇంటి వద్దనే ఎఫ్.పి షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారు**
**కార్డుదారులకు సరుకుల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలి**
**రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదు**
**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



శ్రీకర్నూలు (శ్రీచక్ర) , జూన్ 03: రేషన్ సరుకుల కోసం 65 సంవత్సరాలు పైబడిన వారు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు రావాల్సిన అవసరం లేదని, వారికి ఇంటి వద్దనే ఎఫ్.పి షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు..మంగళవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఎఫ్ పి షాపుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు రావాల్సిన అవసరం లేదు అని, వారికి ఇంటి వద్దనే ఎఫ్.పి షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారు అని గ్రామాల్లో ప్రచారం చేయించాలని కలెక్టర్ తహసీల్దార్ లను ఆదేశించారు..సెక్రటేరియట్ సిబ్బందితో చెప్పించాలని, అలాగే గ్రామాల్లో టాం టాం వేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉదయం 8 గంటలకు ఎఫ్ పి షాపులను తప్పనిసరిగా ఓపెన్ చేయించాలని, తద్వారా పనులకు వెళ్ళే వారు ఉదయమే వచ్చి సరుకులు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు..కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. సరుకుల పంపిణీలో కర్నూలు డివిజన్ వెనుకబడి ఉందని, పురోగతి చూపించాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు అలాగే మండలాల వారీగా ఓర్వకల్, మద్దికెర, ఆదోని, కర్నూలు అర్బన్, సి బెళగల్, కృష్ణగిరి మండలాలు సరుకుల పంపిణీలో వెనుకబడి ఉన్నాయని, వేగవంతంగా పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. మద్దికెర మండలంలో సరుకుల పంపిణీ లో పూర్తిగా వెనుకబడి ఉండడంపై సిఎస్ డిటి కి షో కాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.తహసీల్దార్లు రేషన్ షాపులు తిరిగి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ఆదేశించారు..సచివాలయ సిబ్బంది ఒకరిని సచివాలయానికి ఒక నోడల్ ఆఫీసర్ గా నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి 5 రోజులు తహసీల్దార్లు ప్రతి రోజు ఎఫ్ పి డీలర్లతో సమీక్ష చేయాలని సూచించారు..రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, ఫిర్యాదులు వస్తే డీలర్ల మీద చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. .జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీ నుంచి 5వ తేదీ లోపు 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారుల ఇంటి వద్దకే వెళ్లి సరుకుల పంపిణీ పూర్తిచేయాలన్నారు.. ఆ మేరకు తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు చర్యలు తీసుకోవాలని జేసి ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, డీఎస్ఓ రఘువీర్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 04-06-2025

## సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే రాజకీయాలు

ఆపరేషన్ సిందూర్ భారతదేశం, అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఉపయోగించి, జైష్?ఎ?మహ్మద్ మరియు లష్కర్?ఎ?తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించడం భారతదేశాన్ని కలిచివేసింది. ఈ దాడికి ప్రతీకారంగా, మే 7న భారత వైమానిక దళం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్ భారత సైనిక శక్తి మరియు వ్యూహాత్మక సామర్థ్యాన్ని ప్రదర్శించినప్పటికీ, భారత ఫైటర్ జెట్స్ కూలిపోవడం రాజకీయ చర్చకు దారితీసింది. అయితే తాజాగా త్రివిధ దళాల అధిపతి దానిని ధృవీకరించాడు. ఆపరేషన్ సిందూర్ భారతదేశం, అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఉపయోగించి, జైష్?ఎ?మహ్మద్ మరియు లష్కర్?ఎ?తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. భారత వైమానిక దళం రాఫెల్, సుఖోయ్ ాబీ30 ఓఐఎ, మిరాజ్ 2000, మిగ్?29 విమానాలను, అలాగే బ్రహ్మోస్, స్కాల్ప్, రాంపేజ్ వంటి స్టాండ్?ఆఫ్ క్షిపణులను ఉపయోగించింది. ఈ దాడులు లైన్ ఆఫ్ కంట్రోల్ దాటకుండా, భారత గగనతలం నుండే నిర్వహించబడ్డాయి, ఇది భారతదేశం దీర్ఘ?శ్రేణి కచ్చితమైన దాడి సామర్థ్యాన్ని చాటింది. ఈ ఆపరేషన్‌లో 100కు పైగా ఉగ్రవాదులు నిర్మూలించబడ్డారని, పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన పలు స్థావరాలు ధ్వంసం చేయబడ్డాయని భారత అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సమయంలో భారత విమానాల క్షతాలు ఒక ప్రధాన వివాదాంశంగా మారాయి. పాకిస్తాన్ అధికారులు భారతదేశానికి చెందిన మూడు రాఫెల్, ఒక మిగ్?29, ఒక సుఖోయ్ ాబీ-30, ఒక డ్రోన్‌ను కూల్చినట్లు వాదించారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆరు విమానాలు కూల్చినట్లు కూడా పేర్కొన్నారు, అయితే ఈ వాదనలకు ఆధారాలు అందించలేదు. భారత వైపు నుండి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ బ్లూమ్‌బెర్గ్ టీవీ ఇంటర్వ్యూలో కొన్ని విమాన క్షతాలను ఒప్పుకున్నారు, కానీ పాకిస్తాన్ వాదించిన ఆరు విమానాల సంఖ్యను ఖండించారు. "యుద్ధంలో నష్టాలు సహజం, కానీ మనం ఎన్ని కోల్పోయామనేది కాదు, ఎందుకు కోల్పోయామనేది ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం, భారతదేశం కనీసం మూడు విమానాలు (సంభావ్యంగా ఒక రాఫెల్, ఒక మిరాజ్ 2000తో సహా) కోల్పోయినట్లు సూచించాయి. అయితే ఈ క్షతాలు భారత గగనతలంలోనే జరిగాయని, పాకిస్తాన్ గగనతలంలో కాదని తెలిపాయి. ఈ విమానాలు పాకిస్తాన్ యొక్క చైనా?నిర్మిత ఏ-10అ విమానాలు మరియు ఖఒ?15 క్షిపణుల ద్వారా కూల్చబడి ఉండవచ్చని, లేదా భారతదేశం యొక్క సొంత రక్షణ వ్యవస్థల ద్వారా తప్పుగా లక్ష్యంగా చేయబడి ఉండవచ్చని ఊహాగానాలు ఉన్నాయి. భారత విపక్ష పార్టీ కాంగ్రెస్ ఈ విమాన నష్టంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది, ముఖ్యంగా రాఫెల్ విమానాల క్షతాలపై స్పష్టత కోరింది. కాంగ్రెస్ నాయకులు ఈ ఆపరేషన్‌ను భారత వైమానిక దళం యొక్క లోపాలను బహిర్గతం చేసినట్లు విమర్శించారు, అలాగే ప్రభుత్వం సమాచారాన్ని దాచిపెడుతోందని ఆరోపించారు. అయితే, భారత ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ క్షతాలపై వివరాలను వెల్లడించకుండా, ఆపరేషన్ యొక్క విజయాలపై దృష్టి సారించారు. ఎయిర్ మార్షల్ ఏకే. భారతి "నష్టాలు యుద్ధంలో భాగమే" అని పేర్కొన్నారు, కానీ ఖచ్చితమైన సంఖ్యలను ధ్రువీకరించలేదు. ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ వైమానిక దళానికి గణనీయమైన నష్టం కలిగించింది. భారత దాడులు నూర్ ఖాన్, రఫీకీ, మురీద్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ వంటి పాకిస్తాన్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి, ఇందులో 20% పాకిస్తాన్ వైమానిక ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయని నివేదికలు తెలిపాయి. పాకిస్తాన్ యొక్క ఒక ఈ?16, ఏఈ?17, సాబ్ 2000 ంచింఅ విమానాలు కూడా నాశనం చేయబడ్డాయని, ఇవి పాకిస్తాన్ రక్షణ సామర్థ్యానికి కీలకమైనవని తెలిసింది. ఈ నష్టాలు పాకిస్తాన్ వైమానిక దళాన్ని ఐదు సంవత్సరాల పాటు వెనక్కి నెట్టాయని, రాడార్ వ్యవస్థలు మరియు కమాండ్ సెంటర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని విశ్లేషకులు అంచనా వేశారు. ఆపరేషన్ సిందూర్ భారత వైమానిక దళం యొక్క బలాన్ని చాటినప్పటికీ, కొన్ని సవాళ్లను కూడా బహిర్గతం చేసింది. పాకిస్తాన్ యొక్క చైనా?నిర్మిత ఏ?10అ విమానాలు, ఖఒ?15 క్షిపణులు భారత విమానాలను లక్ష్యంగా చేసుకున్నాయని, ఇది భారత గగనతల రక్షణ వ్యవస్థలలో లోపాలను సూచిస్తుంది. అదనంగా, భారతదేశం రూల్స్ ఆఫ్ ఎంగేజ్‌మెంట్ (ఖీనీఇ) కారణంగా భారత పైలట్లు మొదట దాడి చేయకపోవడం వల్ల పాకిస్తాన్ విమానాలు లాభం పొంది ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఆపరేషన్ భవిష్యత్ కోసం గగనతల రక్షణ సామర్థ్యాలను మెరుగుపరచడం, సమన్వయ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలను పెంచడం అవసరమని సూచిస్తుంది. ఆపరేషన్ సిందూర్ భారతదేశం యొక్క సైనిక సామర్థ్యాన్ని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన స్పందనను ప్రదర్శించింది. ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడం, పాకిస్తాన్ వైమానిక దళానికి గణనీయ నష్టం కలిగించడం ద్వారా ఈ ఆపరేషన్ వ్యూహాత్మక విజయాన్ని సాధించింది. అయితే, భారత ఫైటర్ జెట్స్ నష్టంపై ఉన్న అస్పష్టత, రాజకీయ చర్చ భారత వైమానిక దళం యొక్క సిద్ధత, సమన్వయంపై ప్రశ్నలను లేవనెత్తింది. ఈ ఆపరేషన్ భవిష్యత్ సైనిక చర్యలకు ఒక ముఖ్యమైన పాఠంగా నిలుస్తుంది, భారతదేశం యొక్క రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి మార్గం సుగమం చేస్తుంది.

# దక్షిణాది సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

### -నేడు ఆయన జయంతి



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఆయనకు ముందు తర్వాత అనేంతగా తెలుగుతో పాటు దక్షిణాది సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసారు. ఎస్పీ బాలు విషయానికొస్తే.. ఆయన గొంతులో ఓంకార నాదాలు సందానమై నిలిచాయి. ఆయన పాట శ్రోతలకు పంచామృతం. ఆయన గానం స్వరరాగ నాదామృతం. దివిలో తిరగాడే గంధర్వులు భువికి దిగి వచ్చి పాడినట్లుగా ఉంటుందా గాత్రం. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ లాంటి భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడాడు. అతడి పూర్తి పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. బాలసుబ్రహ్మణ్యం 1946, జూన్ 4 న నెల్లూరు జిల్లా కోనేటమ్మపేట గ్రామంలో సాంప్రదాయ శైవ తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు జన్మించాడు. అతన్ని ఎస్పీబీ అని కూడా పిలవడం కద్దు. అభిమానులు ఆయనను ముద్దుగా బాలు అని పిలుస్తారు. 1966 లో పద్మనాభం నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న చిత్రంతో సినీ గాయకుడిగా అతని ప్రస్థానం ప్రారంభమైంది. తర్వాత మరిన్ని అవకాశాలు తలుపు తట్టాయి. మొదట్లో ఎక్కువగా తెలుగు, తమిళ చిత్రాల్లో పాటలు పాడే అవకాశాలు వచ్చాయి. చాలా మంది నటులకు వారి హావభావాలకు, నటనా శైలికి అనుగుణంగా పాటలు పాడేవాడు. 1969 లో మొదటిసారిగా నటుడిగా కనిపించిన ఈయన తర్వాత కొన్ని అతిథి పాత్రల్లో నటించాడు. తర్వాత అనేక తమిళ, తెలుగు చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించాడు. ప్రేమ (1989), ప్రేమికుడు (1994), పవిత్రబంధం (1996), ఆరో ప్రాణం (1997), రక్షకుడు (1997), దీర్ఘ సుమంగళీ భవ (1998) మొదలైనవి ఆయన నటించిన కొన్ని సినిమాలు. బాలు డబ్బింగ్ ఆర్టిస్టుగా అనేకమంది కళాకారులకు గాత్రదానం చేశాడు. కమల్ హాసన్, రజనీకాంత్, సల్మాన్ ఖాన్, విష్ణువర్ధన్, జెమిని గణేశన్, గిరీష్ కర్నాడ్, అర్జున్, నగేష్, రఘువరన్ లాంటి వాళ్ళకి గాత్రదానం చేసాడు. సినిమాల్లోనే కాక టి.వి రంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ గాయకులను పరిచయం చేశాడు. ఇవి కాకుండా ఈటీవీలో ప్రసారమైన స్వరాభిషేకం లాంటి కార్యక్రమాల్లో తన గానాన్ని వినిపించాడు. అతను కేంద్ర ప్రభుత్వం నుండి 2001 లో పద్మశ్రీ పురస్కారాన్ని, 2011 లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 25 సార్లు వివిధ విభాగాల్లో నంది పురస్కారం అందుకున్నాడు. ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రప్రభుత్వాల నుంచి కూడా పలు పురస్కారాలు అందుకున్నారు. భారతీయ భాషల్లో ఆయన సుమారు 40 వేలకు పైగా పాటలు పాడాడు. అత్యధిక పాటలు రికార్డు చేసిన గాయకుడిగా ఆయన పేరిట ఒక రికార్డు ఉంది. ఆయన సుదీర్ఘ ప్రస్థానంలో 6 జాతీయ పురస్కారాలు, 6 ఫిల్మ్ ఫేర్ దక్షిణాది పురస్కారాలు, ఒక ఫిల్మ్ ఫేర్ పురస్కారం అందుకున్నాడు. 1979 లో వచ్చిన సంగీత ప్రధానమైన శంకరాభరణం చిత్రానికి ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకు 1981 లో బాలీవుడ్ లో ప్రవేశించి ఏక్ దూజే కేలియే చిత్రానికి గాను రెండోసారి పురస్కారాన్ని అందుకున్నాడు. తర్వాత సాగర సంగమం (1983), రుద్రవీణ (1988) చిత్రాలకు జాతీయ పురస్కారాలు అందుకున్నాడు. 25 సార్లు ఉత్తమ గాయకుడిగా, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్టుగా, ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలు అందుకున్నాడు. ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రప్రభుత్వాల నుంచి కూడా పలు పురస్కారాలు అందుకున్నాడు 2020 ఆగస్టు 5 న ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తనకు కోవిడ్-19 వ్యాధి సోకినట్టు ప్రకటించాడు. చికిత్స నిమిత్తం చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరాడు. ఆ తరువాత కరోనా తగ్గినప్పటికీ ఇతర శ్వాసకోశ సమస్యలు ఏర్పడి ఆరోగ్యం విషమించడంతో ఎక్మో, వెంటిలేటర్ సాయంతో చికిత్స కొనసాగించారు. 2020 సెప్టెంబరు 25 న మధ్యాహ్నం 1.04 లకు బాలు తుదిశ్వాస విడిచాడు. 2020 సెప్టెంబరు 26న తిరువళ్ళూరు జిల్లాలోని రెడ్ హిల్స్, తామరపాకం లోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరిగాయి. 2021లోమరణానంతరం కేంద్ర ప్రభుత్వం బాలుకు పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది.


## యాజమాన్య పద్దతులతో అధిక దిగుబడులు : జయశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శాంతి




నిజాంపేట, జూన్ 3 : యాజమాన్య పద్ధతులను అవలంభించి అధిక దిగుబడులు సాధించవచ్చని జయశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శాంతి అన్నారు. మంగళవారం నిజాంపేటలోని రైతువేదికలో విత్తనోత్పత్తి పథకంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రొఫెసర్ శాంతి పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ..అధిక దిగుబడులతో సాధించిన నాణ్యమైన మూలవిత్తనంను ఇతర రైతులకు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రైతులకు వరి, పెసలు మినీ కిట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో రమ్య, మౌనిక, చల్మెడ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నిజాంపేట మాజీ ఉపసర్పంచ్ బాబు, రైతులు చంద్రశేఖర్, నరేశ్ మహంకాళి, శ్రీనివాస్, మురళి తదితరులు ఉన్నారు.

## వార్డుల విభజనపై అభ్యంతరాల స్వీకరణకు ఐదు రోజుల గడువు : ఈఎంసీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 03 : ఏదులాపురం మున్సిపాలిటీ వార్డుల విభజనకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఐదు రోజుల లోపు కార్యాలయంలో అభ్యంతరాలను తెలియజేయొచ్చని మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ నూతనంగా ఏర్పాటు చేయబోయే వార్డుల విభజనకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన మున్సిపాలిటీలో 32 డివిజన్లను ఏర్పాటు చేసి డ్రాఫ్ట్ తయారు చేయడం జరిగిందన్నారు. పూర్వపు 12 పంచాయతీల సమూహంతో ఇప్పటికే ప్రభుత్వం ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలనా సౌలభ్యం కోసం గత కొద్ది రోజుల క్రితం బీఎల్ఓ ల సహాయంతో డివిజన్ల ప్రక్రియ చేపట్టి ముసాయిదా తయారు చేసినట్లు వెల్లడించారు. డివిజన్ల ఏర్పాటుతో పాటు మున్సిపాలిటీ ముఖ చిత్రం సంబంధించిన మ్యాపులు సైతం రూపొందించినట్లు వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్న ప్రజలు దరఖాస్తుల ద్వారా వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చు అని తెలిపారు. తయారు చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను 4వ తేదీన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలకు అందజేయడం జరుగుతుందన్నారు. 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు స్వీకరించిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో మరోమారు విచారణ చేయడం జరుగుతుందని, 17వ తేదీన తుది ముసాయిదాను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 19వ తేదీన అప్రూవల్ నిమిత్తం రాష్ట్ర మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ కు పంపించడం జరుగుతుందన్నారు. అప్రూవల్ వచ్చిన వెంటనే 21వ తేదీన అధికారికంగా డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన తుది డ్రాఫ్ట్ వివరాలను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని ప్రజలు తమ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా తెలియజేయాలని కమిషనర్ కోరారు.



## ఉగ్రవాదులతో సంబంధాలు.. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను తొలగించిన జమ్ము కశ్మీర్ ప్రభుత్వం



పాక్ కోసం గూఢచర్యం వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు భారతీయులు అరెస్టైన విషయం తెలిసిందే. తాజాగా ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్న పలువురు ప్రభుత్వ ఉద్యోగుల పై జమ్ము కశ్మీర్ ప్రభుత్వం వేటు వేసింది. పోలీస్ కానిస్టేబుల్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్ , ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీమ్ అహ్మద్‌ఖాన్.. ఈ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుంచి తొలగించింది. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ముగ్గురు ఉద్యోగులకు లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఉగ్రవాదులకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ముగ్గురుని అధికారులు జైలుకు తరలించారు. ఇష్ఫాక్ నసీర్.. 2007లో రాష్ట్ర పోలీసు శాఖలో చేరాడు. అతని సోదరుడు ఆసిఫ్ నసీర్ 2019లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అతను పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే తోయిబా ఉగ్రవాది. ఆయుధాల అక్రమ రవాణా కేసు దర్యాప్తు సందర్భంగా అతని ఉగ్రవాద సంబంధాలు బయటపడ్డాయి. అతని మరణంతో ఇష్ఫాక్ నసీర్ ఉగ్రకార్యకలాపాలను కొనసాగించాడు. లష్కరే తోయిబాకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు సరఫరాకు సాయం చేసేవాడు. అజాజ్ అహ్మద్.. 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడికి హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్ర సంస్థతో సంబంధాలు ఉన్నాయి. కశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో చురుగ్గా పనిచేస్తూ ఉగ్రవాదులకు ఆయుధాలు, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసేందుకు సాయం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ హ్యాండ్లర్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. వాటిని డెలివరీ చేసేందుకు వెళుతుండగా.. పోలీసులు పట్టుకున్నారు. అతని నుండి హిజ్బుల్ పోస్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వసీమ్ అహ్మద్ ఖాన్.. 2007లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేరాడు. ప్రస్తుతం అతను శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు లష్కరే, హిజ్బుల్ ఉగ్ర సంస్థల కోసం పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అతడికి ఉగ్రవాద సంబంధాలు ఉన్నట్లు 2018లో ఆగస్టులో బయటపడింది. శ్రీనగర్‌లోని బట్‌మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు. జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, అతని ఇద్దరు గార్డుల హత్యకు కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు.

## రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలి : తాసీల్దార్ అనిత

రాజాపేట, జూన్ 03 : రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని రాజాపేట తాసీల్దార్ అనిత అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కాల్వపల్లిలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లోకే అధికారులు వస్తున్నారని, భూ సమస్యల కోసం రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పలువురి రైతుల నుండి భూ సమస్యల వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ఐ రమేశ్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



# సుందరీకరణను పాడు చేస్తే కఠిన చర్యలు: నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు



విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి.. జూన్ 3నగరంలో కూడళ్లపై, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై, గోడలపై, పోస్టర్లు, బ్యానర్లు అతికించినా, రాతలు రాసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు మరోసారి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన లో విడుదల చేశారు. ప్రధాన కూడళ్ల లపై, డివైడర్ల మధ్యలోని స్తంభాలపై, గోడలపై బ్యానర్లు, ప్రైవేటు సంస్థల, సినిమా పోస్టర్లు అతికించడం, రాతలు రాయడం కారణంగా లక్షలాది ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణ పాడు అవుతుందని, కావున రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. దీనిని ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణకు పాడు చేస్తే, వారిపై మున్సిపల్ కౌన్సిల్ సి.ఆర్.నెం: 78 ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# మహానంది క్షేత్రంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-: మహానందిలోని శ్రీ కామేశ్వరీ మహానందీశ్వరులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జిహరిహర నాథశర్మ మంగళవారం దర్శించుకున్నారు.ముందుగా ఆలయ మర్యాదుతో ఆయనకుకార్యనిర్వహణాధికారినల్లకాల్వశ్రీనివాసరెడ్డిఘనస్వాగతం పలికారు. అనంతరంస్వామివారికి ప్రత్యేకపూజలునిర్వహించారు.వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ ఆర్ నగర్ లో కార్డెన్ అండ్ సెర్చ్....



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్ గారి సూచనలతో నేటి తెల్లవారుజామున జిల్లా పట్టణ కేంద్రంలోని వైయస్ ఆర్ నగర్ నందు నంద్యాల తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూఆర్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు .ఈ సందర్భంగా తాలూకా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వైయస్ ఆర్ నగర్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో అనుమానితులు మరియు నేరచరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లని తనిఖీచేసి సరైన ధ్రువపత్రాలు లేని 05 బైక్ లు స్వాధీనం జరిగిందన్నారు . అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సరైన పత్రాలు లేని వాహనాలను కొనడం, తాకట్టు పెట్టుకోడం, దొంగలించడం లాంటి పనులు చేయరాదని,గంజాయి రవాణా ,విక్రయం లాంటి నేరాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరియు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలియజేశారు.రాత్రి వేళలో అనవసరంగా బయట తిరిగితే బౌండ్ ఓవర్ కేసులు పెడతామని రౌడీషీటర్ల మీద మరియు సస్పెక్ట్ షీటర్ల కదలికల మీద గట్టి నిఘా ఉంచడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఈశ్వరయ్య, వంశీధర్ ,చాంద్ బాషా మరియు సబ్-ఇన్స్పెక్టర్లు ధనమ్మ , నజీర్ లు పాల్గొన్నారు.

# యాంత్రీకరణ పద్ధతులు పాటించాలి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-ప్రతి రైతు యాంత్రీకరణ పద్ధతులు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులను పొందేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళి కృష్ణ పేర్కొ న్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అయ్యలూరు. పెద్ద కొట్టాల రైతు కేంద్రంలో సోమవారం యాంత్రీకరణ తదితర వ్యవసాయ పద్ధతులపై నిర్వహించిన సమావేశంలో ఆయన తో పాటు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ధనలక్ష్మి. శాస్త్రవేత్తలు సుధాకర్. సుగన్న హఫీజ్ పర్వీన్. ఏడీఏ రాజశేఖర్ హ ఉద్యాన ఆదికారి నాగరాజు. శ్రీధర్ . మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు. మహేశ్వరి తదితరులు హాజరయ్యారు. భూసార సంరక్షణ, యాంత్రీకరణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని రైతులకు తెలియజేశారు. అనంతరం తదితర పంటల సాగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ముక్తార్ బాష. మణి మోహన్ రెడ్డి. షర్మిల. మాధురి. అయ్యలూరు సర్పంచ్ ఓబులేసు. రైతులు పాల్గొన్నారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





కర్నూలు, జూన్ 03:యోగా తో వేసి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.మంగళవారం యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది యోగభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 వ తేది నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లా లో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. యోగాంధ్ర లో భాగంగా ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్ లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు..ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలలో యోగా నిర్వహించాలనే థీమ్ లో భాగంగా ఈరోజు ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు.. జూన్ 12 వ తేదీన కొండారెడ్డి బురుజు వద్ద, జూన్ 18 వ తేదీన మంత్రాలయం లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.. అదే విధంగా 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో జూన్ 17వ తేదీన కర్నూలు లో యోగా కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యం చాలా బాగుంటుందన్నారు.. ప్రతి ఒకరు యోగా చేసి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు.. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా లో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21 వ తేదీన వైజాగ్ లో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు పాల్గొంటున్నారన్నారు.. ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యోగా గురించి దేశంలో ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలి, అందర్నీ యోగాలో భాగస్వామ్యులు చేయాలనే ఉద్దేశ్యంతోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, యోగా గురువులు ముని స్వామి, విజయ్ కుమార్ఆధ్వర్యంలో యోగా ప్రోటోకాల్ ప్రకారం దాదాపు గంట సేపు యోగాసనాలు వేయించారు..కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయ భారతి, ఓర్వకల్లుఎంపిడిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సాగర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రసాద్, యోగాభ్యాసకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# ప్రతి కుటుంబానికి పిఎం సూర్య ఘర్ పథకం:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-జిల్లాలో ప్రతి కుటుంబాన్ని పిఎం సూర్య ఘర్ పథకం క్రింద నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై ఏపీఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు, ఎనర్జీ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకం క్రింద నమోదు చేసుకున్న దరఖాస్తులలో 458 దరఖాస్తులు కన్వర్ట్ అయి సంబంధిత వెండర్ నుండి కమిషనింగ్ కు వెళ్లాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 97 వేల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్యఘర్ సోలార్ ప్యానల్స్ కనెక్షన్ కోసం పేర్ల నమోదు చేసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలు మినహా పిఎం సూర్య ఘర్ పథకం క్రింద దాదాపు 20 వేల మంది రిజిస్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ అయి కన్వర్ట్ కింద ఉన్న 1513 దరఖాస్తులను కమిషనింగ్ ఈనెలాఖరిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులలో మరో 1513 దరఖాస్తులు కమిషనింగ్ కోసం వెండర్ కు రావాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను కమిషనింగ్ చేసేందుకు వెండర్లు చర్యలు తీసుకునేలా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన వెండర్ వద్దకు కమిషనింగ్ కు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు బ్యాంకుకు అనుసంధానం చేసి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 27 బ్యాంకులకు 27 గ్రామాలు కేటాయించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో అవగాహన తీసుకొని రావాలని ఎనర్జీ అసిస్టెంట్లను కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకుల ద్వారా అందజేసే రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా పాండురంగాపురం గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని పిఎం సూర్య ఘర్ పథకం క్రింద తీసుకొని రావాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు సుధాకర్ పాల్గొన్నారు.

# కామ్రేడ్ నాగన్న మృతి కార్మిక వర్గానికి తీరని లోటు.. సిఐటియు



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జూన్ 3 కార్మిక నాయకుడు కామ్రేడ్ బి.నాగన్న (75) మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని సిఐటియు మండల అధ్యక్షులు సున్నం బట్టీలు ఫ్యాక్టరీల వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రామాంజనేయులు, బి.నాగమద్దయ్య, సీనియర్ నాయకులు జి.కొండయ్య,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య,జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,మండల కార్యదర్శి ఎ.వి.భాస్కర్ రెడ్డి,సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్,బేతంచెర్ల పట్టణ కార్యదర్శి వైబి.వెంకటేశ్వర్లు డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు బి.లక్ష్మన్న అన్నారు.ధర్మవరం గ్రామానికి చెందిన కార్మిక నాయకుడు సున్నం బట్టీలు ఫ్యాక్టరీల హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ బి.నాగన్న అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు.మంగళవారం జరిగిన మృతుని అంత్యక్రియల్లో పాల్గొన్న వారు కోట్ల వారి పల్లి లోని మృతుని స్వగృహం నందు ఆయన భౌతికకాయంపై గౌరవ సూచకంగా సిఐటియు జెండాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతునికి భార్య ఇరువురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ బి.నాగన్న కార్మికుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం పట్ల దాదాపు 35 సంవత్సరాలకు పైగా అంతిమ ఘడియల వరకు ఎనలేని కృషి చేసిన జీవితాన్ని కార్మిక వర్గం కోసం అంకితం చేసిన గొప్ప కార్మిక నాయకుడని కొనియాడారు.ఆయన భౌతికంగా దూరమవడం వారి కుటుంబానికే కాక కార్మిక వర్గానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.అజీపీరా,తిమ్మయ్య,వడ్డే వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు, మధు తదితరులు కార్మికులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.కామ్రేడ్ బి.నాగన్న మృతికి ప్రముఖుల నివాళులు ప్రముఖ న్యాయవాది నాగభూషణం రెడ్డి,పారిశ్రామికవేత్త పెద్ద నాగిరెడ్డి,సున్నం పట్టీలు ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,యజమానులు సివి సుబ్బారెడ్డి,తిమ్మారెడ్డి ,లక్ష్మీనారాయణ యాదవ్,రఘురామిరెడ్డి,బొజ్జులు తదితరులు మృతుని స్వగృహం నందు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సంతాప సూచకంగా యజమానులు కార్మికులకు ఒక రోజు సెలవు ప్రకటించారు.

# వృద్ధుల వికలాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జూన్ 3 డోన్ పట్టణంలో 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు వికలాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి తక్షణ అవసరమైన నిత్యావసర రేషన్ సరఫరా నేరుగా వారి నివాసాల వద్దకే చేయడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని లబ్దిదారులకు రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక న్యాయం, వృద్ధుల సౌలభ్యమే ప్రభుత్వ ప్రాధాన్యతలలో ముఖ్యమని తెలిపారు.

# నేటి వెన్నుపోటు దినం కార్యక్రమ ర్యాలీకి హాజరు అవ్వాలని బుట్టా రేణుక పిలుపు..

విభారే న్యూస్ జూన్ 03 ఎమ్మిగనూరు..జూన్ 4వ తేదీన ఎమ్మిగనూరు నియోజ కవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే 'వెన్నుపోటు దినం' ర్యాలీ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ శ్రేణులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం.




# నందీశ్వర స్వామికిశ్వర విశేషపూజ

శ్రీశైలం జూన్ 3 లోక కల్యాణం కోసం దేవస్థానం మంగళవారం నాడు ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది.ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది.అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది.69 తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది.వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది.

# విశాఖలో శ్రీ చరణ్ సందడి

విశాఖపట్నం,విశాఖలో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల తెలుగు సినీ సంగీత దర్శకుడు సందడి చేశారు. వెండితెరపై విజువల్ ఒండర్ సృష్టించిన మూవీని నగరంలో జగదాంబ థియేటర్ లో అభిమానులతో కలసి తిలకించారు.తన ప్రతీ మూవీని ఆదరిస్తున్న అభిమానులకు ఈ సందర్భంగా శ్రీచరన్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ మూవీకి తగ్గట్టుగా బ్యాక్ గ్రైండ్ మ్యూజిక్ కు మంచి విశేష స్పందన వచ్చిందని,అన్నీ వర్గాల ప్రజలను ఆదరించేలా తన మ్యూజిక్ ను ఎప్పటికప్పుడు కొత్త తరహాలో అందించి మరింత అభిమానులను అలరిస్తానని అన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190